# అంబేద్కర్‌ను హైందవీకరించే సంఘ్‌పరివార్ కుట్రలను తిప్పికొడదాం

## అంబేద్కర్ తాత్విక, సామాజిక అవగాహనలపై విరసం సదస్సుకు అందరికీ ఆహ్వానం

**7 మే 2017 ఆదివారం సాయంకాలం 5.30 గంటలకు**

**వేదిక : తెలంగాణ సారస్వత పరిషత్ హాలు, బొగ్గులకుంట, హైదరాబాద్**

భారత సమాజ ప్రజాస్వామికీకరణలో కీలక పాత్ర పోషించిన చారిత్రక వ్యక్తులను సంఘ్‌పరివార్ సొంతం చేసుకునే కుట్ర చాలా కాలం కిందే మొదలైంది. ఇటీవల అది అంబేద్కర్ దాకా విస్తరించింది. సంఘ్‌పరివార్ తన ఫాసిస్టు స్వభావాన్ని ఒక పక్క బాహాటంగా చాటుకుంటూ ఇంకో వంక దానికి పూర్తిగి వ్యతిరేకమైన వ్యక్తుల గురించి గొప్పగా మాట్లాడుతున్నది. వాళ్ల వారసత్వం తనదేనని ప్రకటించుకుంటున్నది. ఆ వ్యక్తుల అసలైన దృక్పథాన్ని వక్రీకరిస్తూ స్వప్రయోజనాలకు వాడుకుంటున్నది. వాళ్ల దృక్పథాల్లో వైరుధ్యాలు ఉంటే వాటికి తప్పుడు భాష్యం చెబుతూ ఇవాళ తాను శత్రువుగా భావించే దళిత, ప్రజాస్వామిక, విప్లవ శక్తులకు వ్యతిరేకంగా ఎక్కుపెడుతున్నది. అంబేద్కర్ విషయంలో సంఘ్ పరివార్ వ్యాఖ్యానాల్లో ఎన్నో అంశాలు ఉన్నప్పటికీ ఇది ముఖ్యమైన ధోరణి. దీన్ని మొదటి నుంచీ దళిత, ప్రగతిశీల శక్తులు ఖండిస్తున్నాయి.

అంబేద్కర్ 125 జయంతి సందర్భంగా అంబేద్కర్‌పై సంఘ్ తన కాషాయ నీడలు పరిచే దుర్మార్గం ముమ్మరమైంది. ఆయన తరతరాల హిందూ బ్రాహ్మణీయ వ్యతిరేక శక్తుల పోరాటానికి గొప్ప కొనసాగింపు. దేశీయ సామాజిక ఆధునికతా వైతాళికుడు పూలేను గురువుగా భావించిన ఉద్యమకారుడు. అదే సమయంలో పార్లమెంటరీ ప్రజాస్వామిక భావనను పుణికిపుచ్చుకున్న ఆలోచనాపరుడు. బౌద్ధాన్ని ఈ దేశంలో సామాజిక విప్లవంగా భావించడంతో ఆయన అధ్యయనం ఒక కీలక దశలోకి చేరుకున్నది. అప్పటి నుంచి వర్ణ వ్యవస్థ పుట్టుక, కులనిర్మూలన ఆయన పరిశోధనలో కేంద్రస్థానంలోకి వచ్చాయి. కులం నిచ్చెన మెట్ల వ్యవస్థ అని, ఈ దేశంలో శ్రమ విభజనేకాదు, శ్రామికుల విభజన జరిగిందనే అతి ముఖ్యమైన సూత్రీకరణలు చేశారు. కులవ్యవస్థ మౌలిక స్వభావాన్ని అర్థం చేసుకోడానికి అంబేద్కర్ అవగాహన అందరికీ ఉపయోగపడుతున్నది. కులం ఒకప్పుడు ఆర్థిక, సాంఘిక సంబంధాల పునాదిగా ఉన్న దశ నుంచి, ప్రధానంగా సాంఘిక సంబంధాల వ్యవస్థగా (ఆర్థిక సంబంధాల నిమిత్తం బొత్తిగా లేదనికాదు..) మారుతున్న ఈ దశలో కూడా పైన చెప్పిన సూత్రీకరణలకు ప్రాసంగికత ఉన్నది. అయితే కులం హిందూమతం నుంచి, హిందూ ధర్మశాస్త్రాల నుంచి పుట్టిందనే అవగాహన అంబేద్కర్‌కు ఉన్నది. వాస్తవానికి కులవ్యవస్థ లేకుండా పాత రోజుల్లో సనాతన ధర్మాన్ని, వైదిక మతాన్ని ఊహించలేం. అయినప్పటికీ భావజాలం, సంస్కృతి కోణాల్లో కులవ్యవస్థకు బ్రాహ్మణీయ భావజాలం నుంచి, ధర్మశాస్త్రాల నుంచి అందుతున్న ఊతం అంతా ఇంత కాదు. సాంఘిక సంబంధాల పునాది వల్ల కులం భౌతిక వాస్తవం. హిందుత్వ లేదా బ్రాహ్మణిజం దాని భావజాలం. దీన్ని అంబేద్కర్ తనదైన పద్ధతిలో పరిశోధించారు. హిందువుగా పుట్టానుగాని, హిందువుగా మరణించను..అని ఆగ్రహించిన అంబేద్కర్‌ను ఇవాళ సంఘ్‌పరివార్ సొంతం చేసుకోవాలనుకుంటున్నది. దీన్ని ప్రగతిశీలశక్తులు అంగీకరించవు. ఆయన ఈ దేశంలోని దళిత, ప్రగతిశీల శక్తుల సంపద. ఆయన మౌలికంగా సామాజిక శాస్త్రవేత్త. కులవ్యవస్థ, హిందుత్వ వల్ల అంటరానివారుగా వెలివేతకు గురైన దళితుల నాయకుడు. తన జీవితంలోని తొలిదశ అంతా చేసిన కృషి భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో సాంఘిక విప్లవ పాత్రను పోషించింది.

అలాంటి అంబేద్కర్‌కు హిందూ ఫాసిస్టులు తమ జాతీయవాదాన్ని పులిమి తమ వాడిగా చెప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. చారిత్రకంగా వలసవాద వ్యతిరేక పోరాటకాలం ఆయన సాంఘిక ఉద్యమ ఆవరణను సమాయత్తం చేసింది. అందువల్ల ఆయన దళితుల తరపున రాజకీయ నాయకత్వం కూడా వహించాల్సి వచ్చింది. ఆ క్రమంలో రాజ్యాంగ రచనలో పాల్గొన్నారు. స్వతహాగా యూరప్ తరహా పార్లమెంటరీ విధానంలో విశ్వాసం ఉన్నవాడు కాబట్టి అధికార మార్పిడి నాటికి రాజ్యాంగబద్ధ రక్షణ విధానాలు, హక్కులు, ప్రజాప్రాతినిధ్యం మొదలైనవి దళితుల సాంఘిక విముక్తికి మార్గమనుకున్నారు. అదే సమయంలో అనేక తీవ్ర సాంఘిక వైరుధ్యాలున్న సమాజంలోకి రాజ్యాంగమనే ఆదర్శంతో ప్రవేశిస్తున్నామనే ఎరుక ఆయనకు పుష్కలంగా ఉన్నది. ఆ మేరకు రాజ్యాంగం, పార్లమెంటరీ విధానంపట్ల ఆయన విమర్శనాత్మకతను గుర్తించవచ్చు. పార్లమెంటరీ చట్రంలో కూడా ప్రజా ఆకాంక్షల్లాంటి హిందూ కోడ్ బిల్లు ఆమోదం పొందకపోవడంతో న్యాయశాఖ మంత్రిగా రాజీనామా చేయడం ఈ విమర్శనా దృష్టి పదునెక్కడంగా చూడవచ్చు. తిరిగి తన తొలి అధ్యయన వస్తువు, తన తాత్వికతకు మూలం అయిన బౌద్ధాన్ని చేరుకున్నారు. మధ్యలో సొంత రాజకీయ పార్టీలు పెట్టి ప్రయోగం చేసినా వాటి పరిమితులు కూడా చరిత్రలో రికార్డు అయ్యాయి. స్వతహాగా పార్లమెంటరీ విధానం పట్ల ఉన్న విశ్వాసం వల్ల అయితేనేం, వలస నుంచి దేశం బైటికి వస్తున్న చారిత్రక కాలంలో ఉన్నందువల్ల అయితేనేం..చివరి దాకా ఆ మార్గంలోనే దళితుల కోసం ఆరాటపడ్డాడు. జీవిత చరమాంకంలో బౌద్ధం స్వీకరించడాన్ని పాశ్చాత్య పార్లమెంటరీ విధానం నుంచి దేశీయ విప్లవంగా భావించిన బౌద్ధానికి షిఫ్ట్ కావడంగా చూడవచ్చు.

అంబేద్కర్ సామాజిక శాస్త్రవేత్తగా కులం, మతం గురించి ప్రధానంగా రాసినా, సాంఘిక ఉద్యమకారుడిగా తొలి దశ జీవితమంతా వాటికే వెచ్చించినా ఇతరేతర రంగాల్లో కూడా ఆయన పని చేశారు. సమాజ పునాది, ఉపరితలాలలో ఉండే ఆర్థిక, రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో కూడా ఆయన చేసిన కృషి చాలా విస్తృతమైనది, అంతేకాకుండా ఆయన రాజ్యాంగ రచనలో కీలకంగా కృషి చేశారు. ప్రాథమిక హక్కులు, అంటరానితనం నిర్మూలన, రాజ్యం మొదలైన భావనల్లో ఆయన అవగాహనలు కనిపిస్తాయి.

ముస్లింల మీద, కమ్యూనిస్టుల మీద అంబేద్కర్‌కు తీవ్ర వ్యతిరేకత ఉందని, ఆ రకంగా అంబేద్కర్ ఆరెస్సెస్‌కు దగ్గరివాడని సంఘ్ పరివార్ ప్రచారం మొదలెట్టింది. చరిత్రను, విజ్ఞాన శాస్త్రాలను వక్రీకరించే సంఘ్‌పరివార్ ఇప్పుడు అంబేద్కర్ ఆలోచనలకు తన అర్థం చెప్పి వాడుకుంటున్నది. ఆనాడు ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలున్నట్లే అంటరానివాళ్లకు కూడా ప్రత్యేక నియోజకవర్గాలుండాలని అంబేద్కర్ చాలా స్పష్టంగా చెప్పాడు. కులవ్యవస్థ దగ్గరి నుంచి సకల దౌర్భాగ్యాలకు ముస్లింలే కారణం అని చెప్పే నేలబారుతనం ఉన్న సంఘ్ పరివార్ అంబేద్కర్ సామాజిక సిద్ధాంతం గురించి మాట్లాడటం అన్నింటికన్నా ఘోరం. ఇక కమ్యూనిస్టులను వ్యతిరేకించినంత మాత్రాన ఆయన హిందూ జాతీయవాది అయినట్లు కాదు. అంబేద్కర్ కమ్యూనిస్టు కాదు. మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం ఆయనకు పడదు. అయినప్పటికీ భారతదేశంలోని కులవ్యవస్థలోని అంతరాలు, అమానుషత్వం ఆయన ప్రధాన అధ్యయన, పోరాట వస్తువు. ఇక్కడ శ్రమ విభజనతో పాటు శ్రామికుల విభజన జరిగిందని సూత్రీకరించడం వెనుక మౌలికంగా ఒక గొప్ప భావన ఉన్నది. అదే సమానత్వం అనే ఆదర్శం, విలువ. మనుషులంతా సమానంగా ఉండాలని, ప్రతి మనిషికీ ఒకే విలువ ఉండాలని జీవితమంతా తపించిన వ్యక్తి. మరి సంఘ్‌పరివార్‌కు సమానత్వమంటేనే పడదు. అత్యంత ప్రగతి నిరోధక భావాలతో, విప్లవ వ్యతిరేకంగా, ముస్లిం వ్యతిరేకంగా సంఘ్‌పరివార్ దూసుకొని వస్తున్నది. జాతీయవాదాన్ని ఫాసిజంగా అందరి మీద రుద్దుతున్నది. ఈ తరుణంలో అంబేద్కర్‌ను సంఘ్ గొప్ప జాతీయవాదిగా ప్రచారం చేయడం కంటే ఘోరం ఏముంటుంది?

అంబేద్కర్ ప్రభావం ఆయన జీవిత కాలంలో కంటే మరణానంతరమే తీవ్రమవుతున్నది. అనేక కారణాలతో దళితుల్లో చైతన్యం పెరగడం దీనికి ముఖ్య కారణం. అన్ని పార్లమెంటరీ పార్టీలు దళితుల ఓట్ల కోసం, అధికారం కోసం అంబేద్కర్ జయంతి, వర్ధంతినాడు పూలదండలు వేస్తున్నాయి. గాంధీ, నెహ్రూల వలె అంబేద్కర్‌ను కూడా ప్రభుత్వ సింబల్‌గా మార్చేశాయి. వీటన్నిటితోపాటు దళితుల్లో అంబేద్కర్ పేరిట రాజ్యాంగవాదం కూడా పెరిగింది. నిజంగానే డెభై ఏళ్ల తర్వాత కూడా సామాజిక సంపదలో, రాజకీయాల్లో దళితులకు న్యాయమైన వాటా దక్కలేదు, అవి పొందడం దళితుల హక్కు. వాటిని సాధించుకోవాలంటే పార్లమెంటరీ పంథాలో వెళ్లాల్సిందే అనే వాదన బలపడింది. అవైనా పార్లమెంటరీ మార్గంలో వస్తాయా? అనే ప్రశ్న గత యాభై ఏళ్ల అనుభవాల నుంచే విశ్లేషించవచ్చు. వీటన్నిటితోపాటు దళితుల సాంఘిక విముక్తికి మార్గం ఏమిటి? అనే అతి ముఖ్యమైన సవాల్ ఉన్నది. దళిత ఎలైట్ మాత్రం సాంఘిక విముక్తికి బూర్జువామార్గాన్ని బలంగా ప్రతిపాదిస్తున్నారు. విప్లవ పంథాను చిలువలు పలువలు చేసి విమర్శించి ఆనందిస్తున్నారు. కానీ వాస్తవమేమంటే గత డెబ్బై ఏళ్లుగా దళితులను బూర్జువా పార్టీలు ఓటర్లుగానే వాడుకుంటున్నాయి. అంబేద్కర్ కాలంలో పార్లమెంటరీ విధానం ఇంత హేయంగా దిగజారిపోలేదు. దళిత, బహుజనుల, శ్రామిక ప్రజల ఆకాంక్షలను భారత పార్లమెంటరీ విధానం ఘోరంగా అపహాస్యం చేస్తున్నది.

ఈ తరుణంలో అంబేద్కర్‌ను పోరాటశక్తిగా నిలబట్టే దళిత శక్తులు, కులనిర్మూలనా శక్తులు కూడా ఉన్నాయి. విప్లవ రచయితల సంఘం 1986 నుంచి అంబేద్కర్‌ను అధ్యయనం చేస్తూ వస్తున్నది. నక్సల్బరీ నేపథ్యంలో ముందుకు వచ్చిన దళిత ఫాంథర్స్ ప్రభావం కూడా దీనికి దోహదం చేసింది. దేశవ్యాప్తంగా ఆరోజుల్లోనే జరిగిన వర్గపోరాట ఆచరణలో అంటరానితనం నిర్మూలన కీలకంగా ఉంటూ వచ్చింది. మన దగ్గర కారంచేడు నేపథ్యంలో ఫూలేను సాంస్కృతిక పునరుజ్జీవన పితామహుడిగా, అంబేద్కర్‌ను సామాజిక ఉద్యమకారుడిగా, సామాజిక శాస్త్రవేత్తగా, అగ్రకుల హిందూ భావజాలానికి ప్రత్యామ్నాయమైన దేశీయ, బౌద్ధ ఆలోచనా స్రవంతిలో భాగంగా విప్లవోద్యమం, విప్లవ సాహిత్యోద్యమం గుర్తించాయి. దీని వల్లనే విరసం గత నలభై ఏళ్ల సామాజిక ఉద్యమ విశ్లేషణలను సమర్థవంతంగా ఇవ్వగలిగుతున్నది. 1980ల ఆరంభం నుంచే పెరిగిపోయిన హిందుత్వను ఎదుర్కోవడంలో మార్క్సిస్టు పద్ధతిలో దాని రాజకీయార్థిక మూలాలను విశ్లేషించడంతోపాటు దాని భావజాల, సాంస్కృతిక మూలాలను వివరించడానికి ఫూలే, అంబేద్కర్ ఆలోచనలు ఎంతో ఊతం ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో అంబేద్కర్‌ను సంఘ్ పరివార్ కోఅప్ట్ చేసుకోవాలనే కుట్రలను వ్యతిరేకిస్తూ, ఆయన తాత్విక, సామాజిక అవగాహనలపై విరసం ఈ సదస్సు పెడుతున్నది. అందరికీ ఆహ్వానం.

## <u>సదస్సు</u>

**అధ్యక్షత : గీతాంజలి**

| | | |
|---|---|---|
| **అంబేద్కర్ తాత్వికత** | : | **జి.కళ్యాణరావు** |
| **భారతరాజ్యాంగం-అంబేద్కర్** | : | **ప్రొ॥ఎస్. శేషయ్య** |
| **అంబేద్కర్ రాజకీయార్థిక సిద్ధాతం:** | | **డా॥కె.జగన్** |

**అంబేద్కర్ ఆలోచనల వక్రీకరణ-సంఘపరివార్ కో ఆప్షన్ : పాణి**

# విప్లవ రచయితల సంఘం

www.virasam.in e-mail: arunatara1977@gmail.com